క్లుప్తంగా

మామిడి రైతులకు సబ్సిడీ అందేలా చూడండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

గుడిపాల: మామిడి పంట వేసి ఫ్యాక్టరీలకు తరలించిన మామిడి రైతులను పరిశీలించాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయశాఖ, హార్టికల్చర్ అధికారులతో కలిసి వీఆర్ఓలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్, తాసా జ్యూస్ ఫ్యాక్టరీలకు రైతులు మామిడి కాయలను పంపిణీ చేశారని, వీటన్నిటిపై సమగ్రంగా దర్యాప్తు చేయాలన్నారు. వీఆర్ఓల ద్వారా అగ్రికల్చర్ అసిస్టెంట్లు వెళ్లి ఆ రైతుకు సంబంధించిన భూమి ఎంత ఉంది ? అందులో మామిడి పంట ఉందా ? లేదా ? అని తనిఖీ చేపట్టాలన్నారు. ప్రభుత్వం అందించే కిలో మామిడికి రూ.4 సబ్సిడీని అర్హులైన రైతులకే అందేలా చూడాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సంగీత, హార్టికల్చర్ అధికారి ప్రవీణ, డెప్యూటీ తహసీల్దార్ లక్ష్మి పాల్గొన్నారు.

బిల్‌పైనే క్యూఆర్ కోడ్..



క్యూఆర్ కోడ్‌తో వస్తున్న కరెంట్ బిల్లు

గుడిపాల: విద్యుత్ బిల్లుల చెల్లింపులను సరళతరం చేయాలనే ఉద్దేశంతో క్యూఆర్ కోడ్‌ను ఎస్పీడీసీఎల్ అందుబాటులోకి తీసుకొచ్చింది. బిల్లులను చెల్లించేందుకుగానూ కొందరు వసూలు కేంద్రాలకు వెళ్తుండగా, మరికొందరు ఆన్‌లైన్ విధానాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో డిజిటల్ చెల్లింపులు జరిపే వినియోగదారులు కొంతకాలంగా ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా జమచేసే ప్రక్రియను నిలిపేసి, ఎస్పీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. అయితే ఇది సక్రమంగా పని చేయకపోవడంతో వినియోగదారులకు విద్యుత్ బిల్లుల చెల్లింపు కష్టతరమైంది. ఫలితంగా చెల్లింపుల్లో చాలా జాప్యం జరిగేది. ఈ ఇక్కట్లకు చెక్ పెట్టేందుకు ఎస్పీడీసీఎల్ సంస్థ ఈ నెల ఒకటో తేదీ నుంచి క్యూఆర్ కోడ్‌ను అమల్లోకి తీసుకువచ్చింది. వినియోగదారులకు ఇచ్చే బిల్లులోనే క్యూఆర్ కోడ్‌ను ముద్రించి ఇస్తున్నారు. వినియోగదారులు ఇప్పుడు కరెంటు బిల్లులో పొందుపరిచిన క్యూఆర్ కోడ్‌ను ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా స్కాన్ చేసి నగదును చెల్లించవచ్చు. కాగా బకాయిల్లేని వారికే ఈ తరహాలో బిల్లు ప్రస్తుతానికి జారీ అవుతోంది.

లాభసాటి వ్యవసాయమే లక్ష్యం



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: వ్యవసాయ రంగంలో రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి లాభసాటిగా మార్చడమే ధ్యేయమని ఏఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని 35 యర్లంపల్లెలో స్థానిక రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి రైతుకు ప్రతి పథకం లబ్ధి అందేలా అవగాహన కల్పించడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పంట పొలాల్ని ఆశించే చీడ పీడలు, తెగుళ్ల, యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా కంది పంట సాగు చేయాలని సూచించారు. అనంతరం బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, వీఏఏ జ్యోత్స్న పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఆక్రమణలను తొలగించారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్‌వద్ద ఫుట్‌పాత్ నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, తన సిబ్బందితో కలిసి రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. త్వరలోనే ఇక్కడ నూతన ఫుట్‌పాత్ నిర్మించనున్నట్లు ఏసీపీ తెలిపారు.

గర్భాశయ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గర్భాశయ సమస్యలపై నిర్లక్ష్యం వద్దని వైద్యులు ఉషారాణి తెలిపారు. స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా చిత్తూరు నగరంలోని బాబు నర్సింగ్ హోంలో మంగళవారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భధారణ సమస్యలు, కుటుంబ నియంత్రణ, రొమ్ము క్యాన్సర్ అంశాలపై ఆమె వివరించారు. అనంతరం శానిటరీ కిట్స్ పంపిణీ చేశారు. హెచ్‌పీసీఎల్ డిప్యూటీ మేనేజర్ రామమూర్తి, వెంకట రమణ పాల్గొన్నారు.



ఇళ్ల మధ్య నిల్వ ఉన్న మురుగు నీరు



నిధులివ్వక మధ్యలో ఆగిన సచివాలయ నిర్మాణం



నిధులు కేటాయించకపోవడంతో నిర్వహణలో లేని కృష్ణంపల్లి చెత్తసంపద కేంద్రం

నిధులివ్వండి మహాప్రభో !

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పల్లె ప్రగతి అటకెక్కింది. అభివృద్ధి పనులు చేయడానికి నిధులు ఇవ్వకుండా స్థానిక ప్రజాప్రతినిధులను ఇబ్బందులకు గురిచేస్తోంది. కనీసం పారిశుధ్య పనులు చేపట్టడానికి కూడా నిధులు ఇవ్వడం లేదు. దీంతో ఏ గ్రామంలో.. ఏ వీధి చూసినా పారిశుధ్యంతో అస్తవ్యస్తంగా మారాయి. మురుగునీరు పారక దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు అవస్తలు పడుతున్నారు. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధుల బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నారు.

- పడకేసిన పారిశుధ్యం
- చుట్టుముడుతున్న వ్యాధులు
- అటకెక్కిన అభివృద్ధి పనులు
- తలెత్తుకోలేకపోతున్న స్థానిక ప్రజాప్రతినిధులు
- సంక్షేమ పథకాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మళ్లింపు
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న ప్రజాప్రతినిధులు

యాదమరి : మండలవ్యాప్తంగా పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే గుట్టల్లా పోగవుతోంది. దీంతో పచ్చని పల్లెలు కాస్తా చెత్తా చెదారాలతో నిండి అపరిశుభ్రంగా మారడంతో వాతావరణం కలుషితమవుతోంది. పారిశుధ్య చర్యలు చేపడదామంటే నిధులు లేక సర్పంచ్‌లు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కొన్నిచోట్ల ఇబ్బందికరంగా ఉండడంతో కొంతమంది సర్పంచ్‌లు వడ్డీలకు బయట నుంచి తెచ్చి కొంత మేరకు పనులు చేస్తున్నారు. చేసిన పనులకు కూటమి ప్రభుత్వంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో అప్పులపాలవుతున్నామని సర్పంచ్‌లు వాపోతున్నారు. కొన్ని పల్లెల్లో తాగునీటికి సైతం ఇబ్బంది పడుతున్నా ఏమీ చేయలేకపోతున్నామని మరికొంతమంది సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సౌకర్యానికి కూడా నిధులు ఇవ్వకపోవడంతో ప్రజల ఎదుట అభాసుపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి మోటార్లకు చిన్నచిన్న మరమ్మతులు చేయించడానికి కూడా నిధులు లేక పడరాని పాట్లు పడుతున్నామని చెబుతున్నారు. నీటిని క్లోరినేషన్ చేయడానికి అవసరమైన బ్లీచింగ్ కొనుగోలు కోసం రూ.వేలల్లో దుకాణదారులకు బకాయిలు పడుతున్నారు.



కంకర తేలిన నడిమూరు మార్గం

మొక్కుబడిగా నిధుల కేటాయింపు..

అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో మండలానికి మొక్కుబడిగా రూ.40 లక్షలు విడుదల చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ నిధులు విడుదల చేయడంలో జాప్యం చేస్తూ వస్తోంది. కేంద్రం నిధులు విడుదల చేసినా కూడా కూటమి ప్రభుత్వం మాత్రం గ్రామీణాభివృద్ధికి వినియోగించడం లేదు. ఇప్పటి వరకు మండలానికి దాదాపు రూ.50 నుంచి 60 లక్షలు వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రావాల్సి ఉంది.

గ్రామాల్లో వెలగని వీధి దీపాలు

గ్రామాల్లో కనీసం వీధి దీపాలు కూడా సరిగా వెలగడం లేదు. కొన్నిచోట్ల మాత్రం రేయిపగలూ వెలుగుతుంటే మరికొన్ని పల్లెల్లో మాత్రం అసలు పని చేయడం లేదు. వీధిదీపాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు మండలమీట్‌లో ప్రస్తావించినా ఫలితం శూన్యం. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా..ప్రభుత్వం నుంచి నిధులు రాగానే బాగు చేస్తామని సంబంధిత అధికారులు చెబుతుండడంతో దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణాలు జరగలేదు. చిన్నపాటి వర్షం పడినా చిత్తడిగా మారి బురదమయంగా మారుతోంది. గ్రామీన ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులు సైతం ఛిద్రమయ్యాయి. రోడ్లలో గుంతలను పూడ్చడానికి అధికారులు చొరవ చూపడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన సీసీ రోడ్లకు ఇవ్వాల్సిన రూ.లక్షల్లో బిల్లులు పెండింగ్ పెట్టారు. తమ సొంత నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టాలన్నా కూడా కూటమి ప్రభుత్వం సహకరించడం లేదని కొందరు ఆరోపిస్తున్నారు.

మండలం వివరాలు		
పంచాయతీలు	:	26
గ్రామాలు	:	192
సర్పంచ్‌లు	:	26 మంది
ఎంపీటీసీలు	:	13 మంది

వైఎస్సార్‌సీపీ కావడంతో..

స్థానిక ప్రజాప్రతినిధుల్లో సింహభాగం వైఎస్సార్‌సీపీ వారే ఉండడంతో కూటమి ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా అభివృద్ధికి అడ్డుపడుతోంది. గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడానికి అధునాతన సౌకర్యాలతో కూడిన పాఠశాలల నిర్మాణంలో భాగంగా నాడు-నేడు కింద మొదలైన పనులు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో విద్యావ్యవస్థ బలహీన పడుతోంది. వాటికి ఇవ్వాల్సిన బిల్లులు రాలేదు. కనీసం చేసిన పనులకు నిధులివ్వండి మహాప్రభో అని కాంట్రాక్టర్లు వేడుకుంటున్నా కూటమి ప్రభుత్వంలో చలనం రావడం లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసినా కూటమి ప్రభుత్వం వాటిని పంచాయతీల అభివృద్ధికి కేటాయించలేదు. ఆ మొత్తాన్ని తమ సొంత పథకమైన తల్లికి వందనం వైపు మళ్లించింది.

ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం



గ్రామాల్లో పారిశుధ్యం లోపించిన మాట వాస్తవమే. నిధులు రాక పనులు జరగడం లేదు. ఈ సమస్యపై ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. వారికి సమాధానాలు చెప్పలేక ఇబ్బంది పడుతున్నాం. ఈ విషయంపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని సమాధానం ఇస్తున్నారు. ఈ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడిందనేది ముమ్మాటికీ వాస్తవం.

\- సురేష్‌బాబు, ఎంపీపీ, యాదమరి

మోటారు బిగించలేని దుస్థితి



సీఆర్ కండ్రిగ ఆదిఆంధ్రవాడలో నీటి సమస్య ఉందని బోరు వేశాం. కానీ ఇంతవరకు నిధులు లేక మోటారు బిగించలేని దయనీయ దుస్థితి నెలకొంది. కనీసం బ్లీచింగ్ కొనలేని దుస్థితికి తీసుకొచ్చింది ఈ కూటమి ప్రభుత్వం.

\- కె.మీనా, సర్పంచ్, మోర్దానపల్లి

నేడు మండల మీట్

ఐరాల: స్థానిక ఎంపీడీఓ కార్యలయ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోహన్ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. సంబంధిత అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని ఆమె కోరారు.

పశువులకు ముందస్తు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

యాదమరి: మండలంలోని పాడి రైతులు పశువులకు ముద్ద చర్మవ్యాధి(లంపి స్కిన్) రాకుండా టీకాలను తప్పక వేయించాలని మండల పశువైద్యాధికారి డా.మునిచంద్ర తెలిపారు. మంగళవారం ఆయన కొట్టాలం గ్రామంలో పర్యటించి పశువులకు ముందస్తుగా ఉచిత టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముద్దచర్మవ్యాధి ప్రధానంగా చిన్న చిన్న దూడలకు సోకుతుందన్నారు. ఒక పశువు నుంచి మరొక పశువుకి దోమలు, ఈగల ద్వారా వ్యాపిస్తుందన్నారు. దీని ప్రధాన లక్షణం చర్మంపై అక్కడక్కడ బుడిపెలు లాగా వచ్చి పగులుతాయని, కాళ్లు వాపు వస్తాయన్నారు. అందువల్ల పశువులకు ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తే వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకుడు విక్రమ్, రైతులు పాల్గొన్నారు.

చీడ పురుగుల నియంత్రణపై అవగాహన



పొలం పిలుస్తోందిలో భాగంగా వరిపంటను పరిశీలిస్తున్న దృశ్యం

గుడిపాల: రైతులు వ్యవసాయంలో సస్యరక్షణ పద్ధతులు పాటించి పంటలను చీడ పురుగుల నుంచి రక్షించుకోవాలని వ్యవసాయశాఖ ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి సూచించారు. మండలంలోని కోలావూరు, బసవాపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించారు. తెగుళ్ల సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా వరి, వేరుశనగ పొలాలను సందర్శించారు. వేరుశనగ పొలాల్లో ఇనుపదాతు లోపం కనిపించగా, నివారణకు 10గ్రాములు అన్నబేది, సిట్రిక్ యాసిడ్‌ను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అనంతరం వరిపంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు సంగీత, మాధవి పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న డా.సంధ్య

యాదమరి: ప్రతి రైతు సేంద్రియ ఎరువులపై దృష్టి సారించి అధిక దిగుబడి నాణ్యత పొందవచ్చని ఏరువాక శాస్త్రవేత్త డా.సంధ్య చెప్పారు. మంగళవారం ఆమె పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరదరాజులపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో రైతులు రసాయన ఎరువులను అధికంగా వాడుతున్నారని చెప్పారు. తద్వారా భూమిలో పోషకాలు తగ్గి దిగుబడి నాణ్యత తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సస్యరక్షణలో భాగంగా పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా వృక్ష సంబంధమైన కషాయాలు, వేప నూనె వాడాలని రైతులకు సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులకు తగినట్లు పంటలను సాగు చేయాలన్నారు. ఎండు తెగులను తట్టుకునే ఎల్ఆర్‌జీ-52 కంది రకాలను వాడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మాధవి, సిబ్బంది దీప, రైతులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సేవలు



కణ్ణన్ ప్రభుత్వ పాఠశాల, కళాశాల ప్రాంగణాన్ని చదును చేయిస్తున్న పూర్వ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని కణ్ణన్ ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు చేపట్టిన సేవా కార్యక్రమం అభినందనీయమని ఆ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రియాజ్‌బాషా అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మంగళవారం తమ కళాశాలలో బీఎస్ కణ్ణన్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారన్నారు. బీఎస్ కణ్ణన్ పాఠశాల, కళాశాల ప్రాంగణంలో వ్యర్థాలు, పిచ్చిమొక్కలను జేసీబీ సహాయంతో తొలగించారని చెప్పారు. అందుకు అయ్యే ఖర్చును పూర్వ విద్యార్థుల సంఘం విద్యార్థులే భరించారన్నారు. ప్రతి పూర్వ విద్యార్థి తాము చదువుకున్న పాఠశాల, కళాశాల అభివృద్ధికి తమవంతు సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు పూల సుబ్రహ్మణ్యం, సెక్రటరీ మునిరత్నం, కోశాధికారి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభపై తేజోమూర్తి కటాక్షం



ఊంజల్‌సేవలో సీతారామలక్ష్మణులు



సూర్యప్రభ వాహనంపై నుంచి భక్తులను అనుగ్రహిస్తున్న శ్రీరాముడు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సూర్యప్రభ వాహన సేవను ఉభయదారులచే వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు సీతారామలక్ష్మణులకు అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయదారులచే భక్తిప్రపత్తులతో స్వామికి సుప్రభాతం, తిరుమంజనం, పాలాభిషేకం చేపట్టారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. కోదండరాముల వారు మంగళవారం రాత్రి సూర్యప్రభ వాహన సేవలో భక్తలను అనుగ్రహించారు. ఉభయదారులు స్వామికి మేళతాళాలు మంగళవాయిద్యాలు నడుమ గజమాలలు, పూజాసామగ్రి, పట్టు వస్త్రాలు, సుగంధపరిమళ పుష్పాలు, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు స్వామివారికి శాస్త్రోక్తంగా అభిషేకం, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. విద్యుద్దీపాలంకరణలో పుష్పాలతో అలంకరించిన సూర్యప్రభపై కొలువుదీరిన జానకిరాముడు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

కోదండ రామాలయంలో బుధవారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్ సేవ, రాత్రిలో చంద్రప్రభ వాహన సేవ ఉంటుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు.

అడ్రస్ లేని ఆహార సలహా కమిటీలు

- రేషన్ దుకాణాలపై కొరవడిన పర్యవేక్షణ
- సరుకుల పంపిణీలో అవకతవకలు
- పట్టించుకోని అధికారులు

గుడిపాల: రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి, నిరుపేదలకు నిత్యావసరాలు అందేవిధంగా పర్యవేక్షించే ఆహార సలహా సంఘ సభ్యులు ఎక్కడా కనిపించడం లేదు. ప్రస్తుతం ఈ సంఘాల ఉనికి లేకపోవడంతో పర్యవేక్షణ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో తూకాల్లో మోసం జరుగుతోంది. అదే విధంగా లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆహార సలహా కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించేది. మండల స్థాయిలో రేషన్ దుకాణాల నిర్వహణపై సమీక్షించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. చిత్తూరు నియోజకవర్గంలో చిత్తూరు అర్బన్‌తో పాటు చిత్తూరు రూరల్, గుడిపాల మండలాలు ఉన్నాయి. ఇందులో 173 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అదే విధంగా 63,231 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఆహార సలహా కమిటీ చైర్మన్‌గా జిల్లాస్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మండలస్థాయిలో తహసీల్దార్ వ్యవహరించేవారు. సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ సభ్యులు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను నామినేట్ చేసేవారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మీటింగ్ ఏర్పాటు చేసి సక్రమంగా నిత్యావసర వస్తువులు అందుతున్నాయా ? లేదా ? అని సమీక్షించేవారు.



గుడిపాల తహసీల్దార్ కార్యాలయం

చిత్తూరులో రేషన్ దుకాణాలు..

మండలం	రేషన్‌దుకాణాల సంఖ్య	కార్డుదారులు
గుడిపాల	48	12500
చిత్తూరు(అర్బన్)	125	50731

నేడు ఆ పరిస్థితి లేకపోవడంతో నిత్యావసరాల పంపిణీలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి.

ఇష్టారాజ్యంగా పంపిణీ..

ఆహార సలహా సంఘాలు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతను పట్టించుకోవడం లేదు. దుకాణాల తూకాల్లో మోసం జరుగుతున్నా అడిగే వారు లేరు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని పలువురు అంటున్నారు.

బంగారుపాళెంలో ప్రేమ ప్రవాహిని రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు



బంగారుపాళెం:సత్యసాయి పాదుకలకు పూజలు చేస్తున్న భక్తులు



సాయి రథయాత్రకు పూర్ణకుంభ స్వాగతం

బంగారుపాళెం: శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం సోమవారం రాత్రి బంగారుపాళెంకు చేరుకుంది. భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ఏప్రిల్ 24వ తేదీ పుట్టపర్తి ప్రశాంతి నిలయం నుంచి సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథ యాత్ర ప్రారంభమైంది. రాత్రి బంగారుపాళెం చేరుకోగా స్థానిక సత్యసాయి సమితి సభ్యులు, భక్తులు యాత్రా రథానికి పూర్ణకుంభంతో మేళతాళాలతో స్వాగతం పలికారు. స్వామివారి రథాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సత్యసాయి బాబా చిత్రపటానికి, సాయిపాదుకలకు పూజలు నిర్వహించారు. ప్రేమ ప్రవాహిని రథం ముందు చిన్నారులు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో చిత్తూరు, బంగారుపాళెం సమితి అధ్యక్షులు మధుసూదన్, ప్రతాప్‌చంద్రనాయుడు, సభ్యులు చంద్రశేఖర్, శంకర్‌రెడ్డి, గురునాథం తదితరులు పాల్గొన్నారు.